

'మా తెలుగుతల్లి' శంకరంబాడికి నివాళి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



మా తెలుగు తల్లి'కి మల్లెపూదండ గేయరచయిత శంకరంబాడి సుందరాచారి పుట్టినరోజు సందర్భంగా ఆయన విగ్రహానికి వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, పయ్యావుల గురునాథం, రఫీ తదితరులు నివాళి అర్పించారు. వారు రచించిన మా తెలుగు తల్లికి అంటూ రాసిన గేయం ఆంధ్ర రాష్ట్రానికి అధికారిక గేయంగా ఉంటూ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సుందరాచారి 1914, ఆగస్టు 10న తిరుపతిలో జన్మించాడన్నారు.

ముక్కంటీశా..
నీ భద్రత.. నీదే..!

- 'లోగుట్టు' ముక్కంటికెరుక..!
- ఆలయ భద్రత గాలికి
- పనిచేయని లగేజీ స్కానర్లు
- కనిపించని హ్యాండ్ డిటెక్టర్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాహు కేతు పూజల ద్వారా రోజు రోజుకూ ఆదాయం పెరుగుతోంది. అయితే వసతుల కల్పనలో మాత్రం అభివద్ధి కనిపించడం లేదు. ఏడాదికి రూ.150 కోట్ల వార్షికాదాయం పొందుతున్నా భద్రతా చర్యలు శూన్యమనే చెప్పాలి. దాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నా భద్రతా వ్యవస్థ డొల్లతనంగా ఉంది. భద్రతాచర్యలు తీసుకోకపోవడంలో లోగుట్టు ముక్కంటికే తెలియాల్సి ఉంది. భద్రత కోసం కొనుగోలు చేసిన పరికరాలు అన్నీ మూలన పడ్డాయి. తూర్పు గోపురం, దక్షిణ గోపురాల వద్ద ఏర్పాటు చేసిన లగేజీ స్కానర్లు అప్పుడప్పుడు మాత్రమే పని చేస్తాయి. మెటల్ డిటెక్టర్లు ఏవీ పనిచేయడం లేదు. చేతి డిటెక్టర్లు కూడా కనిపించడం లేదు. లగేజ్ బ్యాగులు ఆలయంలోకి వెళ్లాలంటే స్కానింగ్ చేసిన తర్వాత తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే స్కానర్లు పనిచేయవు. ఎస్పీఎఫ్, హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని భద్రత కోసం వినియోగిస్తున్నారు. సెల్ ఫోన్లు, కెమెరాలు, లగేజిలు లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే ఇది సక్రమంగా అమలు కావడం లేదు. ఏడాదికి సుమారు 150 కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా భద్రత విషయంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదు. సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు అవసరమైన యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులు నివేదికలిచ్చారు. అయితే నివేదికలు అమలు కావడం లేదు. కరోనా సమయంలో శివలింగం, నంది విగ్రహాలను భక్తులు ఆలయంలోకి తీసుకెళ్లి ప్రతిష్ట చేశారు. ఆ విషమం కొన్ని రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది.

ఈ ఏడాది జరిగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు ఒక బాలుడు అర్ధరాత్రి తర్వాత ఆలయంలో నుంచి బయటకు రావడం కలకలం రేపింది. ఇంత జరిగినా విచారణ లేదు. ఎవరిపైనా చర్యలు లేవు. ఇటువంటి భద్రతా లోపాలు చాలానే ఉన్నాయి అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత స్పందించడం, కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మర్చిపోవడం షరా మమూలయ్యింది. అధికారులు ఇప్పటికైనా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.





ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అక్బర్, భగత్ రవి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా అక్బర్, భగత్‌రవి తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా ప్లీనరీ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వినోద్(తిరుపతి సిటీ), తేజ (చంద్రగిరి), ఉమేష్ (పుత్తూరు), జిల్లా సహాయ కార్యదర్శులుగా సుష్మిత (గర్ల్స్ వింగ్), నరేంద్ర (ఎస్వి యూనివర్సిటీ), బాల (సిటీ), గురవయ్య (శ్రీకాళహస్తి), తొమ్మిది మందితో జిల్లా కార్యవర్గ సభ్యులు గా, 10 మంది జిల్లా కమిటీ సభ్యులు గా మొత్తం 19 మందిని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు గా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ తిరుపతి జిల్లా లోని విద్యా రంగం సమస్యల పై విద్యార్థులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్వి పాలిటెక్నిక్ కళాశాలకు హాస్టల్ నూతన భవనం ఏర్పాటు చేసి విద్యార్థులు కోర్స్ పూర్తి అయ్యే వరకు హాస్టల్ లో వసతులు కల్పించాలని, తిరుపతి నగరం లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలనీ, టీటీడీ విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలపై తీర్మానాలు చేసి వాటి కోసం ఎస్ఎఫ్ఐగా ఉద్యమం చేపడుతుందన్నారు.

కచ్చెప్పి ఆడిటోరియం 'అద్దె' తగ్గింపు : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



స్మార్ట్ సిటీ పథకంలో నిర్మించిన కచ్చెప్పి ఆడిటోరియం అద్దె ధరలను రోజుకు 70వేల నుంచి 30వేలకు తగ్గించారు. దాదాపు 40వేల రూపాయలను తగ్గించినట్లు కమిషనర్ నారప్పరెడ్డి మౌర్య వెల్లడించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆడిటోరియం తిరుపతి ప్రజలకు అనువైనదని అన్నారు. గతంలో అద్దె రోజుకు 70వేలు ఉండేదని, ప్రస్తుతం అద్దె ధర రూ.25వేలు, క్లీనింగ్‌కు ఐదువేలు కలిపి మొత్తం 30వేలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఇక కచ్చెప్పి ఆడిటోరియంలో సాంస్కతిక కార్యక్రమాలు, ఫోటో ఎగ్జిబిషన్లు, పదవీ విరమణ ఫంక్షన్లు, జన్మదినాలు నిర్వహించుకోవచ్చు అని చెప్పారు. తిరుపతి నగరంలో ప్రైవేట్ కేబుల్ వైర్లు ఇష్టానుసారంగా విచ్చలవిడిగా రోడ్లపై వేలాడుతున్నాయని, వెంటనే కేబుల్ ఆపరేటర్లు కేబుల్ వైర్లను ప్రత్యేక డక్ లో వేయాలని అన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి రాత్రిపూట రోడ్లు ఊడ్చే పద్ధతిని మళ్లీ ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. ఇందుకుగాను ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ బాగు చేయడానికి అవసరమైతే టీటీడీ సాయం కోరుతామని చెప్పారు. వర్షాలు కురుస్తుండడంతో నగరంలో 99 లక్షలు రూపాయలతో కాలువల్లో పూడికతీత పనులను వేగవంతం చేస్తున్నట్టు పేర్కొన్నారు. డబుల్ డెక్కర్ బస్సును ఎలా సద్వినియం చేస్తారని విలేకరులు ప్రశ్నించగా డబుల్ డెక్కర్ బస్సుకు ఆర్టీవో శాఖ పర్మిషన్ ఇవ్వలేదని కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ లో రెండు కోట్ల 35 లక్షలతో కొనుగోలు చేశామని. ఈ బస్సును ఆర్టీసీ కి ఇవ్వాలా, లేదంటే కంపెనీకే తిరిగి అమ్మేయాలా అనే ఆలోచనలో ఉన్నట్టు వెల్లడించారు.

'ప్రజాదర్బార్' దృష్టికి శెట్టిపల్లి భూ సమస్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూ సమస్యను వెంటనే సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాదాపు మూడువేల మంది తమ గోడును విన్నవించుకున్నారు. తిరుమలలోని ఆర్‌బి సెంటర్‌లో దాదాపు 50ఏళ్లుగా నివసిస్తున్న 84 ఇళ్లను డిస్టర్బ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు వాపోయారు. దాదాపు 20 సమస్యలపై అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, చేజర్ల మనోహర్ ఆచారి, ఊట్ల సురేంద్రనాయుడు పాల్గొన్నారు.





సూళ్లూరుపేటలో...

ఉద్యమ స్ఫూర్తితో...అవినీతికి వ్యతిరేకంగా..
యుటిఎఫ్ రాజీలేని పోరాటాలు

- జిల్లావ్యాప్తంగా స్వర్ణోత్సవ వేడుకలు
- పురవీధుల్లో భారీ ర్యాలీలు, సభలు



పుత్తూరులో..

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, యంత్రాంగం

ఉద్యమ స్ఫూర్తితో.. అవినీతికి వ్యతిరేకంగా.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సౌకర్యాల కల్పనకు శక్తివంచన లేకుండా యుటిఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తుందని వక్తలు ఉద్ఘాటించారు. జిల్లా వ్యాప్తంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.

శ్రీకాళహస్తిలో సిఐటియు కార్యాలయం వద్ద శనివారం యుటిఎఫ్ పతకాన్ని ఆవిష్కరించి, ఉపాధ్యాయుల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కేఎస్బీ సూర్యప్రకాష్, రాష్ట్ర నాయకులు జీ శ్రీనివాసులు సంయుక్తంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై యూటిఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. సామాజిక స్పృహ కలిగిన సంఘంగా యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయులకవసరమైన సౌకర్యాలు కల్పించడానికి శక్తి వంచన లేకుండా పాటుపడిందని తెలిపారు. నేటికీ అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శివనాథపురం వద్ద ఉన్న అమ్మ వద్ద మహిళా ఆశ్రమంలోని వద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి కే మోహన్ బాబు, సి వెంకటకష్ణ, ఓ విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వై విజయశ్రీ పాల్గొన్నారు.

వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల శాఖల ఆధ్వర్యంలో జరిగింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కుమారస్వామి నదీతీరం పాఠశాల వద్ద సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిన యూటిఎఫ్ అనేక సమరశీల పోరాటాలు, ఆందోళనలు చేసి ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. ప్రాథమిక విద్యను మాతభాషలోనే బోధింపజేయాలని, ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను సమాంతరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆదినారాయణ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రత్నశేఖర్. డక్కిలి మండలాధ్యక్షులు గంగారావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాలాయపల్లి ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పి.శ్రీరాములు, సుధీర్, కె.నాగేంద్ర పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో..

సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండల శాఖల ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.శ్రీనివాసులు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు జి.జె.రాజశేఖర్ మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిన యూ టి ఎఫ్, అనేక సమరశీల పోరాటాలు, ఆందోళనలు చేసి ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యారంగాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిందని, భవిష్యత్తులోనూ ఈ పంథాలోనే కొనసాగుతుందని, ప్రభుత్వం విద్యారంగం అభివద్ధికోసం కషిచేయాలని, ఇందుకు అడ్డుగావున్న 117 జి ఓ ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి సహకరించాలని, సి పి ఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని, ప్రాథమిక విద్యను మాతభాషలోనే బోధింపజేయాలని, ఉన్నతపాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంను సమాంతరంగా ఉంచాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. అనంతరం సూళ్లూరుపేట పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కే.ఎం.ఎస్. సునీల్ ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.బాబు, సిఐటియు నాయకులు బి.పద్మనాభయ్య, సిహెచ్.సుధాకర్ రావు పాల్గొన్నారు.



వెంకటగిరిలో..

గూడూరులోని విఆర్‌వి భవనం ఎదుట పతాకావిష్కరణ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సుధీర్, హరిబాబు పాల్గొన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ వాసుదేవరావు, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. పుత్తూరులో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు దాసరి మునయ్య, తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన జెండాను ఆవిష్కరించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి కార్యాలయం వద్ద సమావేశంలో ఐదు దశాబ్దాల పోరాటాన్ని వక్తలు విశదీకరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొలత్తూరు భాస్కర్, నాయకులు కె.వేణుగోపాల్, దశరథన్, బాలాజీ, జయచంద్రన్, మురళి, గోపి పాల్గొన్నారు. నాయుడుపేట యుటిఎఫ్ కార్యాలయంలో పతాకావిష్కరణ జరిగింది. యుటిఎఫ్ అధ్యక్షులు కె.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి టి.గోవర్ధన్‌రెడ్డి, ఓజిలి మండల అధ్యక్షులు జి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, పెళ్లకూరు అధ్యక్షులు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఏడాది డిసెంబర్‌లో కాకినాడ నగరంలో స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నాయన్నారు. ఈ సభలకు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.



ఎన్డీఏ ఏర్పాటులో రిటైర్ ఉద్యోగుల పాత్ర కీలకం : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటులో రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర కీలకమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం శనివారం తిరుపతిలో జరిగింది. సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించారు. అయితే తనకన్నా పెద్దలైన రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించడం సముచితమని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేఆర్ శంకర్‌ను ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే చర్యను హర్షిస్తూ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కరతాళధ్వనులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యగులకు మూడు నెలలకు ఒకసారి అన్ని వైద్యపరీక్షలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తమకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పెన్షర్ల సంఘం పేరిట దౌర్జన్యంగా భవనాన్ని నిర్మించారని ఎమ్మెల్యే దష్టికి రిటైర్డ్ ఉద్యోగులు తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్,రమణరాజు, జనసేన నాయకులు రాజా రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన14వ వార్షిక ఏపీ మెడికాన్ సమావేశాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో వైద్య విద్య అధ్యాపకులకు, వైద్య విద్యా బోధన విభాగం, రాష్ట్ర వైద్య విద్యా ఉపాధ్యాయుల సంఘం తో అనుసంధానమై (మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్) సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 14వ రాష్ట్ర వ్యాప్త వార్షిక సమావేశం ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా వైద్య అధ్యాపకులకు నేషనల్ మెడికల్ కమిషన్,(న్యూఢిల్లీ) వారి సౌజన్యంతో, 2023-24 లో ప్రవేశ పెట్టిన నూతన వైద్య విద్య బోధనా విధానాలు, వైద్య పరీక్షలకు సంబంధించిన మార్పులు, చేర్పులను గురించి, వైద్య విద్యలో కత్రిమ మేధస్సు గురించి ప్రసిద్ధిగాంచిన వైద్యులు ఉపన్యాసాలు ఇచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విజయవాడ ఆంధ్ర ప్రదేశ్, కి అనుసంధానంగా ఉన్న ఎస్ వి. వైద్య కళాశాలలో ఈ సదస్సు 11 సంవత్సరాల క్రితం మొదట జరిగింది, ఇప్పుడు 2 వ సారి తిరుపతి వేదిక నిర్వహించారు. వైద్య విద్యా సంచాలకులు (అకాడమిక్) విజయవాడ డాక్టర్ జి.రఘునందన్ మాట్లాడుతూ ఆరోగ్యంలో పెను మార్పులు వస్తున్నందువలన , ఎప్పటికప్పుడు నూతన వైద్య విద్యను వైద్య అధ్యాపకులు తెలుసుకున్నట్లయితే, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని తెలిపారు. వైద్య విద్య బోధన గురించి సదస్సులో నూతన మార్పులను గురించి, పాత పద్ధతుల ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన వైద్య విద్యా బోధనా పద్ధతుల్లో నూతన మార్పులు వలన కలిగే ప్రయోజనాలు అందరికీ తెలియజేయ గలుగుతున్నమని, పేద రోగులకు మెరుగైన కార్పొరేటు వైద్యం అందించడానికి, ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సదస్సులో వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్ నుండి సుమారు 400 మంది వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు హాజరయ్యారు. దేశ నలుమూలల నుండి ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ పియుష్ గుప్త, డాక్టర్ విష్ణు భట్, డాక్టర్ శంకర్ నచికేత్, డాక్టర్ మహాలక్ష్మి ఉపన్యసించారు. డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్.ఎన్ . మూర్తి, డాక్టర్ ప్రతిభ స్రవంతి, డాక్టర్ రామ దేవి, డాక్టర్ ఉమా దేవి, డాక్టర్ మాధవీలత, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ ఫహీం, డాక్టర్ భారతి పాల్గొన్నారు.



'అమూల్' మూసేసి ..'పాడి' కట్టేస్తారా..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అందరికి అన్నం పెట్టే అన్నదాత రైతు. నిత్యం పంటపొలాల్లోనే ఉంటూ ఆహార ఉత్పత్తి చేయడంలో రైతే కీలకం. అందరి ఆకలి తీర్చే రైతు బతుకు ఎపుడూ చీకటిమయమే. ప్రకృతిని ప్రేమిస్తూ.. పగవారికి సైతం పట్టెడు అన్నం పెట్టే రైతు బతుకు చిధ్రమైంది. కుటుంబ పోషణ కోసం రైతు ప్రత్యామ్నాయాల వైపు మళ్లినా.. వ్యవసాయం తర్వాత ఆయనకు తెలిసింది. పాడి మాత్రమే. కన్నతల్లికంటే మిన్నగా పశువులను చూసుకోవడం ఆయనకు మాత్రమే తెలిసిన విద్య. అమ్మపాలను తలదన్నే ఆవుపాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. అలాంటి పాలను నమ్ముకునే రైతులు జీవనాన్ని లాగించేస్తున్నారు. కానీ ప్రస్తుత బూర్జువ రాజకీయాలు పాడిపైన కూడా పెత్తనం చెలాయించేందుకు పూనుకున్నాయి. ఇంకేముందే పాడి రంగంలోనూ కార్పొరేట్ హవా పెరుగుతోంది. దీంతో క్రయవిక్రయాల్లో చాలా వ్యత్యాసాలు చూపుతూ రైతులను నిలువున దోచేస్తున్నారు. ఆ కోవలోనే తాజాగా అమూల్ చేరుతోంది. మరో పది రోజుల్లో ఆ సంస్థను మూసే కుట్ర ఊపందుకోవడం గమనార్హం. రాజకీయ కుతంత్రాలకు పాడి రైతులు బలి కానున్నారు. వైసిపి హయాంలో 'అమూల్'ను నెత్తిన పెట్టుకున్నారు.. ప్రస్తుతం టిడిపి కూటమి దాన్ని అథ:పాతాళానికి తొక్కేయనుందని చర్చ నడుస్తోంది. అయితే వైసిపి ప్రభుత్వమైనా, టిడిపి కూటమైనా 'చిత్తూరు' సహకార విజయ డెయిరీని తెరిపించకపోవడం గమనార్హం.

పాడిరైతుకు కాస్త భరోసా ఇవ్వాలన్నా...శ్రమకు తగ్గ ఫలితం దక్కాలన్నా పాడి రంగం ప్రభుత్వ పరిధిలో ఉండడం ఒకటే మార్గం. ప్రభుత్వ సహకార రంగంలో పరిశ్రమలు ఉంటే అటు రైతుకు...ఇటు వినియోగదారుడికి మంచే జరుగుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తున్న విజయ పాల డెయిరీని గతంలో చంద్రబాబు హయాంలో మూసేశారు. జిల్లాకే చెందిన నారా వారి ప్రయివేట్ పాల ఫ్యాక్టరీ లాభాల కోసం దీన్ని మూసేశారని జనమే విమర్శించారు. గత వైసిపి హయాంలో 'హెరిటేజ్'ను దెబ్బతీసేందుకు అమూల్ పాల పరిశ్రమను తీసుకొచ్చి, ప్రభుత్వ సహకారం రంగం ద్వారా పాల సేకరణ చేయిస్తూ పాత విజయ డెయిరీ స్థానంలో కొత్త డెయిరీని ఏర్పాటు చేశారు. దీంతో పాల కొనుగోలులో పోటీ పెరిగి ధర కాస్త పెరిగింది. పాడి రైతు కాస్త ఉపశమనం పొందాడు. గతంలో పాల ఫ్యాక్టరీలో రూ.25నుంచి రూ.28 వరకే ఇచ్చేవారు. అమూల్ రాకతో ధర అమాంతం పెరిగింది. లీటర్ పాలకు రూ.34 నుంచి రూ.42 వరకు పెంచారు. 16 నెలల కిందట ప్రారంభమైన అమూల్ సేవలు ఊపందుకున్నాయి. అమూల్ తొలి దశలో వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, ఎర్రావారి పాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో అమూల్ పాల సేకరణ ప్రారంభించారు. దశలవారీగా జిల్లాలోని 34 మండలాల్లో అమూల్ పాలకసేకరణ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. 16 నెలల కిందట 5 మండలాల్లోని 47 గ్రామల్లో 1850 మంది రైతుల ద్వారా 3,550 లీటర్ల పాల సేకరణతో మొదలు పెట్టారు. ఆరు నెలలు గడిచే కొద్ది 15,582 మంది రైతుల నుంచి 19,500 లీటర్ల పాల సేకరణకు చేరుకుంది. ప్రస్తుతం రోజుకు 21వేల లీటర్ల పాల సేకరణ అమూల్ సంస్థ నుంచి జరుగుతోంది. విస్తారంగా రైతులకు వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇప్పించడంతో రైతులు పెద్ద ఎత్తున పశువులను కొనుగోలు చేసి పాలను అమూల్‌కు అందించేవారు. దీనికి తోడు పాలకు గిట్టుబాటు ధర రావడంతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. పైగా జిల్లాలోనే ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు చెందిన పాల డెయిరీ ఉంది. ఇంకేముంది..అమూల్ మూసివేతకు చర్యలు ఊపందుకున్నాయి. ఆగస్టు 21 నుంచి డెయిరీని మూసివేసేలా వత్తిడి తీవ్రతరం చేశారు. పాడి రంగంలోని అమూల్‌ను కట్టేసేందుకు జిల్లాలో ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయి. అమూల్ అధికారులను బెదిరించి, క్రయ విక్రయాలను పూర్తిగా తగ్గించారు. పాడిరైతులను బెదిరించి, ఇక నుంచి తమకంటే తమకే పాలను ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికే ప్రయివేట్ పాల కంపెనీలు హెరిటేజ్, తిరుమల డైరీ, దొడ్ల డైరీ, శివశక్తి వంటి ఆరుకుపైగా ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. అమూల్ రాకతో వీటి వ్యాపారం కొంత తగ్గింది. తాజాగా చంద్రబాబు కుటుంబ సభ్యులకు చెందిన పాల డైరీ వ్యాపారాన్ని వృద్ధి చేసేందుకు అమూల్‌ను మూపించేసేందుకు పూనుకోవడం గమనార్హం. ఇప్పటికైన అధికార పార్టీ నాయకులు ఆలోచించి రైతులకు కాస్తో కూస్తో న్యాయం జరిగేందుకు సహయపడుతున్న అమూల్ కంపెనీని కొనసాగించాల్సి ఉంది.

వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమం లో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతగా మెడనూ రు సురేష్ రెడ్డి, శాంతి సాయం అందిం చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం లోనే సంతృప్తి అని వుంటుందని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు రాధయ్య, కరిముల్లా, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, కృష్ణారెడ్డి, శ్రావణ్, వాకటి శ్రీనివాసులు, విజయ్, నాగేంద్ర, యశ్వంత్, కళ్యాణి పాల్గొన్నారు.

కాణిపాకం వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కుటుంబ సభ్యులు, భార్య, ఇద్దరు పిల్లలతో కాణిపాకం వినాయకుడిని శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు. ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. వారి కుటుంబ సభ్యులకు శాలువా కప్పి సత్కరించి వినాయకుని చిత్రపటాలను బహూకరించారు. ఆయనకు పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: విజయ వాడలోని సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడిని ఖండిస్తూ శనివారం బిఎన్ కండ్రిగ మండలం పల్లమాల పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు పాలాభి షేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహా శిల్పంపై అల్లరి మూకల దాడి హేయమైన చర్య అన్నారు. అనంతరం విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి నివాళులు అర్పించి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహంపై దాడి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకు లు గురవయ్య, రాకేష్, గురునాథం, రవి రెడ్డి, మణి నాయుడు, సాయి నాయుడు, తలారి వెట్ సర్పంచ్ వెట్టి ప్రసాద్. ప్రసాద్ పాల్, అజయ్ రెడ్డి, కోటేశ్వరరావు, కిరణ్, హేమంత్, వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి సర్పంచులు, సెక్రటరీలకు శిక్షణ

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుండి మూడు రోజులు పాటు గ్రామ సర్పంచులకు, సెక్రటరీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికాల ఆదేశాల మేరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు శిక్షణ తరగతులు వుంటాయన్నారు. ముఖ్యంగా పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మి కంపోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక, ఆర్థిక వనరులు సమీకరణ తదితర అంశాలపై ఆగస్టు 12,13,14వ తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు మండలంలోని 28 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చి నాయుడు కండ్రిగ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల12వ తేదీ నుంచి మూడు రోజులు పాటు గ్రామ సర్పంచులకు,సెక్రటరీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో త్రివిక్రమ రావు పేర్కొన్నారు. ఉన్నతాధికాల ఆదేశాల మేరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మండలంలోని 28 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీ పద్మావతి అమ్మవారి భక్తులకు గాజుల పంపిణీ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రత సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి అమ్మవారి తిరుచానూరులో 6 వేల డజన్ల గాజులు 12 వేల కంకణాలు పసుపు కుంకుమ ప్యాకెట్లను తిరుచానూరుకు చెందిన సివిల్ ఇంజనీర్ బుసా షర్మిల షణ్ముగం దంపతులు పంపిణీ చేశారు. ప్రతి ఏటా అమ్మవారి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి భక్తులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గోవిందరాజన్ సూపరింటెండెంట్ శేషగిరిరావు, వాహనం ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, ఆలయ ప్రధాన అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

సుమన్‌కు టిటిడి పాలకమండలిలో చోటు కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చలన చిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్న నటుడు సుమన్‌కు టిటిడి పాలకమండలిలో చోటు కల్పించాలని సుమన్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు నారాయణ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ను విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు ప్రేక్షకులకు చెరిపేయిలేని గుర్తింపుపొందిన పాత్రలను నటుడు సుమన్ పోషించారన్నారు. అన్నమయ్య చిత్రం యావత్ ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరిని అలరించిన చిత్రమని, అందులో వెంకటేశ్వర స్వామిగా నటుడు సుమన్ వైవిధ్యభరితమైన నటనను ప్రదర్శించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సురేంద్ర నాయుడు, మాధవ్, నాగవర్ధన్, హేమంత్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవ చేసిన వారినే ఎన్నుకోండి: చీర్ల కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి ఉద్యోగులకు సేవ చేసిన వారినే ఎంప్లాయిస్ బ్యాంక్ ఎన్నికల్లో గెలిపించాలని టిటిడి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఎంప్లాయిస్ బ్యాంక్ ఎన్నికల్లో తాము పోటీ చేస్తున్న ప్యానెల్ అభ్యర్థులను ప్రకటించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో టిటిడి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం శ్రమించిన గుంటూరు రేఖ, వంకీపురం పవన్, మణికంఠ, సునీల్ కుమార్ యాదవ్ లను బ్యాంక్ ఎన్నికల్లో ఉద్యోగులు ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతిలో బలిజ వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: జిల్లా బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి త్వరలో బలిజ వివాహ పరిచయ వేదిక ను నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు నీలం నరేంద్రనాథ్ తెలిపారు. స్థానిక యూత్ హాస్టల్ లో శనివారం "బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి" (బీస్) కార్యవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నరేంద్రనాథ్ మాట్లాడుతూ తిరుపతి పట్టణ శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బలిజ వివాహ పరిచయ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బలిజ ఉద్యోగులు కులంతో సంబంధం లేకుండా అన్ని కులాలవారికి, మతాల వారికి వృత్తి పరంగా సహాయపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సింగంశెట్టి మునిశంకరయ్య, సత్యనారాయణ నాయుడు, తోకల అశోక్ కుమార్, బి. ప్రభు రెడ్డి, పూల సురేష్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉపాధ్యాయుల సంక్షేమమే పిఆర్‌టియు ధ్యేయమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి గిరి ప్రసాద్ పేర్కొన్నారు. పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పిఆర్‌టియు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసేసంఘం పిఆర్‌టియు మాత్రమేనన్నారు. ప్రభుత్వంతో స్నేహపూర్వక వాతావరణం కాకుండా సామరస్య ధోరణితో ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరేలా కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు వి ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కెవెన్ కణ్ణన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిరుపతి జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులుగా శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి సదాశివన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుకారాంను ఎన్నుకున్నారు.

ఆర్‌వో ప్లాంట్ వాటర్ స్వచ్ఛమేనా?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆర్వో, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నుండి వాటర్ క్యాన్లు విక్రయిస్తున్న వారి సంఖ్య పెరిగింది. పట్టణంలో ఇటీవల



- మినరల్ , ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో విక్రయం
- జోరుగా కోట్ల రూపాయల్లో వ్యాపారం
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు

మినరల్, ప్యూర్తిపై వాటర్ పేరుతో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈక్యాన్లలో వస్తున్న తాగునీరు ఎంతవరకు సురక్షితమో తెలియడంలేదు. స్వచ్ఛమైన నీరేనా..? ప్రజల నుండి పలు విమర్శలు వస్తున్నాయి. మినరల్ వాటర్, ప్యూరిఫైడ్ వాటర్ అంటూ నిత్యం క్యానులతో హోటళ్లు, కార్యాలయాలు, గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, తదితర సంస్థల వద్ద అధిక సంఖ్యలో ఈ వాటరు క్యాన్లు దర్శనమిస్తున్నాయి. క్యానుల్లో సరఫరా అవుతున్న నీరు సురక్షితమేనా? వీటిని నిత్యం శుద్ధి చేస్తున్నారా..? ఈ క్యానుల్లో ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లపై ప్రభుత్వ పర్యవేక్షణ లోపించింది. 20 లీటర్ల వాటర్ క్యాన్ 90 పర్యాయాలు కంటే ఎక్కువ వాడకూడదు.. కానీ మూడేళ్లు దాటినా అవే క్యాన్లు వినియోగిస్తున్నారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇలాంటి వ్యాపారం జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు ఈ కంపెనీలపై దృష్టి సారించి సురక్షిత వాటర్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -కోట : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం దైనందిక జీవితంలో ఒక భాగమని కోట నూతన తహశీల్దారు కె జయజయరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయం చుట్టూ పక్కల ఉన్న అనేక రకాల పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో కోట తహశీల్దారు కార్యాలయం పరిశుభ్రంగా మారింది. ప్రతిరోజూ పలు పనుల మీద ప్రజలు కోట తహశీల్దారు కార్యాలయాలకు వస్తుంటారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జయజయరావు చుట్టూ పక్కల వాతావరణాన్ని పరిశీలించి పిచ్చి మొక్కలు ఉండడంతో తక్షణమే స్పందించి జేసిబి సాయంతో పెద్దపెద్ద మొక్క లను తొలగించి చదును చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం బాగుం టుందని తహశీల్దారు గుర్తు చేశారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న తహశీల్దారు కార్యాలయ సిబ్బంది

స్థానిక కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి పలు రకాల చిన్నపాటి మొక్కలను తొలగించారు.

పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేవీఎన్ రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంఘం పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, వేంకటేశ్వర హాస్పిటల్ మార్గాల్లో శనివారం పారిశుధ్యం పనులను ఆయన పర్యవేక్షించారు. కాలువల్లో పూడికలు, పారిశుధ్య కార్మికులతో పూడిక తీతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అదనపు పనిమనుషలతో పూడికతీత చేపట్టారు. వర్షం వస్తే నీళ్లు నిలవకుండా డ్రైనేజీలో మురికి నీరు, వర్షపు నీరు నిలవకుండా వెళ్లిపోయేందుకు చేపడుతున్నారని కమిషనర్ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీ రింగ్ ఏఇలు, శానిటరీ ఇన్‌స్పెక్ట ర్లు ఇంద్రసేన నాయు డు, సచివాలయ సిబ్బంది పర్య వేక్షించారు.


పుత్తూరులో పాదిశుధ్య పనులు నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శిథిలావస్థలో పశువైద్యశాల

ప్రజాశక్తి - సత్యవేడు:

సత్యవేడు మండల కేంద్రంలోని పశు వైద్యశాల దాదాపు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అయినప్పటికీ అనేక సంవత్సరాలుగా శిథిలమైపోయిన భవనంలోనే ఉప విభాగ స్థాయి వైద్యాధికారి పశువులకు వైద్యం నిర్వహిస్తున్నారు. ఈ పశువైద్యశాల భవనం 1988లో నిర్మించినప్పటికీ నాసిరక నిర్మాణం కారణంగా ఈ భవనం గత 10 సంవత్సరాల నుండి శిథిలావస్థకు చేరుకుంది. అసలే చిన్న భవనం.. ఎటుచూచినా వర్షపు నీరు కారిపోతూ పెచ్చులు ఊడి దర్శనమిస్తోంది. పైకప్పులతోనూ పాములు తేళ్ల ఆవాసానికి అనుకూలమైన గుంతలు, రంధ్రాలతో కూడిన గోడలు దర్శనమిస్తోంది. ఈ పశు వైద్యశాల సత్యవేడు పట్టణాన్ని ఆనుకొని ఉన్న దళవాయి అగ్రహారం , కోమటి గుంట , బీసీ కాలనీ, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాలలోని పశువులకు అతి సమీపంలో ఉన్న తమిళనాడుకు చెందిన కొన్ని గ్రామాలు, సత్యవేడు మండలానికి చెందిన ఈ వైద్యశాల పరిధిలోకి రాని మరికొన్ని గ్రామాలకు సంబంధించిన పశువులకు దాదాపు వెయ్యి గేదెలు, 1600 ఆవులు, 4వేలు గొర్రె మేకలు, 1300 పైగా కోళ్లకు వైద్యం అనునిత్యం అందిచాల్సి వుంది. ఈ వైద్యశాలలో డివిజనల్ స్థాయి అధికారి ఉండటానికి, పరిధిలోని వైద్యశాలలకు అవసరమైన అనేక వైద్య పరికరాలు, వైద్య సంబంధిత ఔషధాలు నిల్వ చేయాల్సి వుండడంతో మొత్తం వెరసి వైద్యశాల లోపల కనీసం కూర్చోవడానికి కూడా స్థలం లేని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు వర్షపు నీరు కారణంగా ఎంతో ఖరీదైన వైద్య సామగ్రిని, ఔషధాలలు తడిచి త్వరగా పాడైపోతున్నాయి. గతంలో అనేకసార్లు ఈ వైద్యశాలకు సంబంధించి దినపత్రికల్లో వార్తా కథనం ప్రచురితం కావడంతో కేవలం కొంత స్థలాన్ని మాత్రమే ఈ వైద్యశాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు భవన నిర్మాణానికి నోచుకోకపోవడం వేలాది రైతుల అనుబంధ జీవనాధారంపై ప్రభావం చూపుతోంది.

భూమి ఉంటే రేషన్ కట్!

- తెల్ల రేషన్ కార్డులకు కొత్త రూల్స్
- ఆహార శాఖ కసరత్తు
- 3 హెక్టార్ల కంటే ఎక్కువ వద్దని నిబంధన

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు అనుసంధానం చేశారు. దీంతో ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందడంలేదు. దీని వల్ల ఉన్నత వర్గాలను, అట్టడుగు వర్గాలను వివిధ రకాలుగా విభజించే పనిలో నిమగ్నం కానుంది. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డును రూపొందించింది. ఈ రేషన్ కార్డుల ద్వారానే ప్రభుత్వం పేద ప్రజలకు ప్రతి పథకాన్ని, సౌకర్యాన్ని అందిస్తోంది. దీని వల్ల అందరికీ బీపీఎల్ రేషన్ కార్డు వస్తుందని అనుకోవద్దు.. ఎందుకంటే ఇప్పుడు నకిలీ పత్రాలు ఇచ్చి బిపిఎల్ రేషన్ కార్డు కలిగి ఆర్థికంగా నిల దొక్కుకున్న వారు కూడా ప్రభుత్వ కళ్లలో దుమ్మెత్తి పోస్తున్నారు. అర్హులకు అందాల్సిన సేవా సదుపాయాలు తెల్ల రేషన్ కార్డు ద్వారా కొంతమంది అనర్హులకూ అందుతున్నాయి.

నకిలీ పత్రాలు ఇచ్చి తెల్ల రేషన్ కార్డులు పొంది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు రేషన్ కార్డులను రద్దు చేసేందుకు ఆహార శాఖ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. చాలా సందర్భాల్లో ఇలా తప్పు చేసినందుకు చట్టపరమైన కేసులు పెట్టే అవకాశం వుంది. అంతకు ముందు కార్డులను సరెండర్ చేయాలని చెబుతున్నారు. కార్డు వినియోగదారుడు రైతు అయినా మూడు హెక్టార్ల కంటే ఎక్కువ భూమి ఉంటే తెల్ల రేషన్ కార్డు వచ్చే అవకాశం లేదు.

భూమి మించకూడదు

ఆహార శాఖ నిబంధనల ప్రకారం, తెల్ల రేషన్ కార్డు పొందిన కుటుంబానికి మూడు హెక్టార్ల కంటే ఎక్కువ వ్యవసాయ భూమి లేదా స్వంత భూమి ఉంటే వారికి ఏ కారణం వల్లా రేషన్ కార్డు ఇవ్వకూడదని నిబంధనల్లో రాశారు. కార్డు దారుడు వ్యవసాయ దారుడే అయినా ఈ నిబంధనల ప్రకారం నిర్ణీత భూమి కంటే ఎక్కువ భూమిని ఉంటే తెల్ల రేషన్ కార్డు వచ్చే అవకాశం లేదు. ఒక వేళ ఉంటే, వెంటనే దాన్ని సరెండర్ చేయాలి. వారి రేషన్ కార్డు రద్దు చేస్తారు. ఈ మేరకు అధికారుల హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



'ఆదిశంకర'లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా లో 33 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే కాకుండా వారు జీవితంలో స్థిర పడేందుకు అవసరమైన వసతులు సమకూర్చడంలో ఆదిశంకర కళాశాల యాజమాన్యం ముందుంటుందన్నారు. అందులో భాగంగానే ఈ జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. కళాశాల ఛైర్‌పర్సన్ అరవింద, వైస్ ఛైర్ పర్సన్ వంకీ అనూష మాట్లాడుతూ గత 28 సంవత్సరాల్లో ఆదిశంకర విద్యార్థులకు ఉన్నత విద్య , ఉద్యోగ అవకాశాలు కల్పిం చ టంలో ముందు ఉంటుం దని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా పలువురు ఉద్యోగాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో 1845 మంది విద్యార్థులు



పాల్గొనగా 532 మంది నియామక పత్రాలు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కటారి అరవింద, కలశాల డైరెక్టర్ రాజా మురగ దాస్ , కోఆర్డినేటర్ లు విజయ నిర్మల, సురేష్, వేణుమాధవ్, డాక్టర్ మురళి, ఏవో రామయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

స్టేషన్ మాస్టర్‌కి వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు నెలకొన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ పుత్తూరు స్టేషన్ మాస్టర్‌కు బిజెపి మండల అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, సభ్యులతో కలిసి శనివారం వినతిపత్రం అందించారు. నూతనంగా నియమితులైన రైల్వే కన్సల్టేటివ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కమిటీ సభ్యులు ప్రతిపాదనలు, ప్లాట్‌ఫాం మెట్లపై వర్షం పడకుండా రేకులు వేయాలని, రైల్వేటేషన్ చివర్లో మరొక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని కోరారు. చెన్నై నుంచి తిరుత్తణి వరకు వచ్చే లోకల్ ట్రైన్లు పుత్తూరుకి ఎక్స్‌టెన్షన్ చేయా లన్నారు. బెంగళూరుకి వెళ్లే శనివారం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ట్రైను పుత్తూరు లో ఆపాలని కోరారు. ఈ కార్యక్రమానికి రైల్వే కన్సల్టేటివ్ మెంబర్స్ కోటకొండబాబు, సుబ్రహ్మణ్యం రాజు, మధు, శంకర్ , సీనియర్ నాయకుడు శేఖర్ , రైల్వే అధికారులు పాల్గొన్నారు.

బురదచల్లడం మానుకోవాలి: టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -వాకాడు: టిడిపి పై బురదచల్లె ప్రయత్నం మానుకోవాలని గూడూరు నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక ఇరిగేషన్ బంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొమ్మను విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ శిలాఫలకంలో తొలగించిన విషయంపై వైసిపి నాయకులు చెప్పిన మాటలకు దీటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండేటి నందగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని తమకు అలాంటి నీచ రాజకీయాలు అవసరం లేదని, తామంతా కలిసి కట్టుగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజల కోసం పనిచేస్తామని ఎట్టి పరిస్థితుల్లో ఎడబాటు రానివ్వబోమని, ప్రజలకు అందు బాటులో వుండి సేవ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల టిడిపి నాయకులు రమణయ్య, బుజగేంద్రరావు, టిడిపి మండలా ధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి , కొండాపురం నాయకులు గోపి నాయుడు, మోహన్ నాయుడు, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


అనాథలుగా మారిన చిన్నారులు

ప్రజాశక్తి -బాలాయపల్లి: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని మృతితో ముగ్గురు ఆడపిల్లలు, భార్య అనాథలయ్యారు..ఈ సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. బాబు నాయుడు(40) మండలంలోని నిండలి గ్రామంలో కొనుగోలు చేసిన ఇంటిలో శుక్రవారం తెల్లవా రుజామున గృహప్రవేశం చేశాడు. ఆ ఆనందం లో మద్యం తాగాడు. కడుగుంట - నిండలి రోడ్డు మార్గంలోని తోట సమీపానికి బాబు నాయుడు శనివారం అర్ధరాత్రి వెళ్లాడు. రెండో తూము వద్ద మద్యం తాగి అదే తూముపై పడుకున్నాడు. బాగా నిద్రపోవడంతో మత్తులో నీళ్లలో పడ్డాడు. రాత్రంతా ఇంటికి రాక పోవడంతో నిద్ర లేచి ఆయన సోదరుడు రాఘవేంద్ర వెతుక్కుంటూ వెళ్లాడు. తూము వద్ద మోటార్ సైకిల్, సెల్ ఫోన్ ఉండడం గమనించి నీళ్లలో చూశాడు. బాబు నాయుడు బోర్లపడి మృతి చెంది ఉండటం గమ నించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. బాలాయపల్లి పోలీసులు, వెంకటగిరి సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య భార్గవి, ముగ్గురు ఆడపిల్లలు శ్రీదేవి 4వ తరగతి, శ్రీ కుట్టి 3వ తరగతి, రెండు సంవత్సరాల చరిష్మా ఉన్నారు.

తండ్రి మృతితో అనాథలు

బాబునాయుడు మృతితో ముగ్గురు ఆడ పిల్లలు అనాథలయ్యారు. మృతుడు భార్య భార్గవి భర్త మృతదేహాన్ని చూసి 'అయ్యా లే.. ఈ ముగ్గురు ఆడ బిడ్డలను ఎవరు చూసు కుంటారు అయ్యా? వాళ్లని ఎవరు చదివిస్తారయ్యా ..నాకు ఏమీ తెలియదు..నాకు ఉన్న దిక్కునువ్వే.. నువ్వు లేకపోతే నా పిల్లలకి బువ్వ పెట్టే వాళ్లు ఎవరయ్యా?" అంటూ కన్నీరు కారుస్తుంటే గ్రామస్తులు కంటతడి పెట్టడం కనిపించింది.

దాడి కేసులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: దాడి కేసులో వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ సీఐ పాపారావు కథనం మేరకు.. గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటకు చెందిన అల్లా బక్షుకు మసీదు ప్రాంతానికి చెందిన సోనియాతో వివాహమైందన్నారు. గత కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయన్నారు. బనిగిసాహెబ్ పేటలో సోనియా ఒంటరిగా నివాసం ఉంటోంది. సోనియా ఆమె సోదరులు జాకీర్, షాకీర్‌లు సోదరితో మాట్లాడేందుకు వెళ్లగా అదే సమయంలో అల్లా భక్షు అతని తల్లిదండ్రులు రోకలి బండతో సోనియా, ఆమె సోదరులపై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన జాకీర్‌ను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకు వెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడన్నారు. సోనియా, మరో సోదరుడు షాకీర్‌లకు గాయాలు కావడంతో వారు గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ పాపారావు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమ మట్టి తవ్వకాలు

- ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి
- వివరాలు వెల్లడి కాకుండా నొక్కిపెట్టేందుకు యత్నం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్రమ మట్టి తవ్వకాలు ఓ వ్యక్తి నిండు ప్రాణాలను బలిగొన్నాయి. హడావిడిగా మట్టిని తరలించే క్రమంలో ట్రాక్టర్ కింద విశ్రాంతి తీసుకుంటున్న ఓ డ్రైవర్ మీదుగా టైరు వెళ్లడంతో తొట్టంబేడు మండలం కల్లిపూడి పోలిగుంట చెరువులో శనివారం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కల్లిపూడి గ్రామానికి సమీపంలో ఉన్న పోలిగుంట చెరువు, కొత్తచెరువు, రౌతుగుంట చెరువుల్లో గత వారం రోజులుగా కొందరు అధికార పార్టీ నేతలు జెసిబిలు, ట్రాక్టర్ల సాయంతో పగలూ రాత్రి అన్న తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఆ మట్టిని సమీప ప్రాంతాల్లో ఉన్న పలు పరిశ్రమలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పోలిగుంట చెరువులో శనివారం నాలుగు జెసిబిలు, 35 ట్రాక్టర్ల తోటి మట్టి తవ్వకాలు చేస్తుండగా మధ్యాహ్న సమయంలో భోజనం చేసి ట్రక్కు కింద విశ్రాంతి తీసుకుంటున్న ట్రాక్టర్ డ్రైవర్ పైకి అనుకోకుండా టైరు వెళ్లింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు కింద విశ్రాంతి తీసుకుంటున్న బుచ్చినాయుడు కండ్రిగ మండలం భవాని శంకరాపురానికి చెందిన గుణశేఖర్(21) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అయితే ఈ విషయాన్ని బయటకు వెల్లడి కాకుండా తొట్టంబేడు మండలానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతలు నొక్కిపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. దీంతో శనివారం రాత్రి వరకు పోలీసులకు సమాచారం అందని పరిస్థితి. ఎట్టకేలకు సమాచారం అందుకున్న తొట్టంబేడు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

అర్హులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ పరిధిలో అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు పెండిగ్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఏడో వేతన సంఘం సిఫార్సుల మేరకు 2016 సంవత్సరం నుండి అమలు చేయాల్సిన వేతన సవరణను 2017లో అమలు చేసి ఒక ఏడాది అరియర్స్‌గా పెండింగ్ ఉంచారన్నారు. 18 నెలల డీఏలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, ఆ ఎన్నికలు రైల్వే బోర్డు పరిధిలో కాకుండా సెంట్రల్ లేబర్ కమీషనర్ ఆధ్వర్యంలో జరపాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు డిపాజిట్లు రద్దు చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్ర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. మనోహరం తదితరులు పాల్గొన్నారు.


మాతమ్మ ఆలయానికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

మాతమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని బ్రాహ్మణ కాలువ, వడ్డీ కాలువ గ్రామాలలో నిర్వహిస్తున్న మాతమ్మ ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే పులివర్తి నానికి మంగళ వాయిద్యాలు, బాణా సంచాలు పేలిస్తూ ఘనస్వాగతం పలికి దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలటిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, సి జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచ్ ధనంజయులు, గిరి, సురేష్ నాయుడు, జయచంద్ర నాయుడు,కోరా హరిప్రసాద్, కే నరసింహారెడ్డి,, మాజీ ఎంపీపీ కేశవుల నాయుడు, మహేష్, సురేంద్ర, శేఖర్, టి చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.